

# స్వరూపంలో రూపం

కథానిక

"శ్రీ"

ఆ దినం కూడా రోజూమాదిరే సాయంత్రం ఆరుగంటలయ్యేసరికి రాధయింటికి వెళ్ళాను. ఆమె వాకిట్లో జాజిపందిరిక్రింద కూర్చుని జాజి మొగ్గలు దండకట్టుతూ సన్నగా పాడుకుంటూంది. తలుపుతీసేవుందేమో నేను శబ్దంచేయకుండా లోపలికి వెళ్ళి కొంచెంసేపు ఆమె చల్లనిపాట వింటూ నిల్చుండిపోయాను. అంతలో ఆమె తిరిగిచూసింది.

"ఓహో! ఎంతసేపయింది వచ్చి—దొంగలాగ వచ్చారేం?" అన్నది నవ్వుతూ.

"దొంగనైతే దాక్కొని వుండేవాడినికదా!" అన్నాను నేను.

"కూర్చో" అని లోపలికివెళ్ళి మామూలు ప్రకారం కాఫీ తెచ్చింది. "రాధా, నిన్ను 'కళ్యాణి' అని యెందుకు పిలవకూడదు? నువ్వు కళ్యాణి రాగంలో ఆ కీర్తన పాడుతూవుంటే ఎంతహాయిగా వుంది!" అన్నాను.

"యింకానయం! కాఫీరాగంలో పాడితే 'కాఫీ'అని పిలుస్తావులావుంది"అందామె నవ్వుతూ.

"లేదురాధా! నీవుపాడే ఆ కళ్యాణిలో వింత శోభలున్నాయి. మన మొదటిపరిచయం గుర్తుందా? ఆనాడు కాలేజీడేకి నీవు కళ్యాణిలో ఎంత చక్కగా పాడావు! అందరూ ముగ్ధులై పోయారు కదూ!"

"ఛాలులే నీ పొగడ్తలు. ఇది మామూలేకాని నువ్వు మీ వూరికి ప్రయాణమెప్పుడు?"

"ప్రస్తుతం వెళ్ళడంలేదు. అసలు వెళ్ళకుండా యిక్కడే వుండాలనుకుంటున్నాను నీలయితే."

"కారణం?"అన్నదామె ప్రశ్నార్థకంగా.

"ఏమీలేదు. మా రాధ వొంటరిదైపోతుందేమోనని."

"ఓహో! అదేకారణమైతే నీవుండిపోనక్కరలేదులే! వొంటరి జీవితం నాకు కొత్తకాదు."

"పోనీ నిజంచెప్పు రాధా, నేనులేకపోతే నీకు కష్టంగా వుండదూ?"

"కష్టమెందుకూ? మళ్ళీ పాతపుటలు తిరగవేస్తాను. నీతో పరిచయం కాకముందు యెలాగ బ్రతికేదానినో అదేవిధంగా బ్రతుకుతాను."

"అప్పుడు కాలేజీ వుండేది. ఏదో కాలక్షేపం అయేది. ఇప్పుడా సెలవులు. నీ వెక్కడికీ వెళ్ళవు కదూ. నీకీ వొంటరితనంలోని బాధ అణుమాత్రం తెలియడంలేదా రాధా?"

"హు! నీవు చాలా అమాయకుడవు. మనిషి పుట్టినపుడు ఒంటరిగానే పుట్టాడు. చనిపోయినప్పుడు వొంటరిగానే చనిపోతాడు. అయితే యిక బ్రతకడం మాత్రం వొంటరిగా యెందుకు బ్రతకలేడు?"

"అది చాలా పెద్ద వేదాంతం. మనిషి పుట్టినపుడు తల్లిరక్తం పంచుకుని పుడతాడు. తల్లే అతనికి తోడునీడై రక్షిస్తుంది. చనిపోయేటప్పుడు తనకోసం యేడిచే పదిమందినీ విడిచిపోతాడు. ఇక బ్రతికింతకాలం ఒక్కొక్కదశలో ఒక్కొక్కరి సహచర్యం వుండనే వుంటుంది. కనీసం నీడయినా తోడుంటుంది. ఇది నా వేదాంతం."

"అందరూ నువ్వు చెప్పిన జాతిలోనికి రారు. పుట్టుకతోటే తల్లిని కోల్పోయిన అనాథలుంటారు, బ్రతికినంతకాలం చీకటిలోనే నివసించే వారికి తోడుగా వుండడానికి

నీడమాత్రం యెక్కడినుంచి వస్తుంది? చనిపోయినప్పుడు వారిని గురించి యేడవడానికి కూడా యెవరూవుండని నిర్భాగ్యులు ప్రపంచంలో యెంత మందో వుంటారు.”

“సరే నీతో నేను వాదించలేను. కాని నేనింక వెళ్ళనా?” అన్నాను చివరకు విసుగుగా.

వెళ్లు. కాని యింటికివెళ్ళే ప్రయత్నంలో వుండమనే నేను కోరుతున్నాను” అన్నది.

నేను నా రూముకు వచ్చి తలుపు తెరచేసరికి కిటికీలోనుంచి వుత్తరాలు పడవేసి వున్నాయి. ఆత్రుతలో. అమ్మ వ్రాసిన వుత్తరంవిప్పి చదివాను:

“చిరంజీవి మధుమూర్తికి, మీ అమ్మ దీవించి వ్రాయునది: నీకు వేసవి శలవులు యిచ్చారనుకుంటాను. త్వరలో యింటికి వస్తావని యెదురు చూస్తున్నాను. క్రిందటి శలవులకు కూడా చదువుకోవాలని నీ వింటికి రానేలేదు. ఇప్పుడు చదువు పూర్తిఅయింది కాబట్టి తప్పక వచ్చివేయవలెను.

నిన్నను మామయ్య వుత్తరం వ్రాశాడు. వాళ్ళ వూళ్ళో డిప్యూటీ కలక్టరుగారి అమ్మాయిని నీకు యిస్తామంటున్నారని-పిల్లను చూచుకుందుకు నిన్ను పంపమని వ్రాశాడు.

నాయనా! నీకు తెలుసుకదా—ఏదో మీనాన్నగారు పూర్వకాలపు మనిషి అవడంచేత మీ అన్నయ్యకు చిన్నప్పుడే వదిననిచ్చి పెండ్లిచేశారు కాని పెద్దవాడయాక అతని అభిప్రాయాలు మారిపోయాయి. మాతో తన మనసులోవున్న మాట అయినా చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఈనాటి వరకూ అతడెక్కడున్నాడో కూడా తెలియనే తెలియదు. మీ నాన్నగారు ఆ బెంగతోనే చనిపోయారు కదా!

పెద్దవాణ్ణిగురించి యిప్పటికీ బెంగతో చచ్చిపోతున్నాను. ఇక వున్న వొక్క మొగపిల్లవాడివి సుఖపడడంకంటె నాకేం కావాలి? కనుక నీ మనస్సులో మాట సంశయింపక చెప్పు. నీ యిష్టమే యిష్టమనుకోవచ్చును. నీ రాకకొరకు నీ చెల్లిళ్లు యెదురుచూస్తున్నారు.

మీ అమ్మ, సరస్వతమ్మ.

ఉత్తరం చదివినంతసేపూ అన్నయ్య జ్ఞాపకం వచ్చి కొంచెం మనస్సు కించపడింది. కాని అమ్మ అమాయకత్వం చూసి నవ్వు వచ్చింది. “పాపం! వ్యధితహృదయం యెంత బాధపడుతూందో అన్నయ్య చేసిన పనికి! మా అన్నయ్యంటే నాకు చాలా గౌరవభావ ముండేది. ఎంత తెలివైనవాడు! ఎంత గుణవంతుడు! కాని యిలాంటి పిరికిపని చేశాడెందుకో?” అనుకున్నాను.

తర్వాత రెండవ ఉత్తరం విప్పాను-మామయ్య వ్రాశాడు:

చిరంజీవి మధుమూర్తికి,

ఆశీర్వచనములు. నీవు పెద్దవాడవయ్యావు, బి. ఏ. పూర్తయింది. త్వరలో ఫలితాలు కూడా వస్తాయి. ఇష్టముంటే యింకా చదవవచ్చును. కాని మీ అమ్మకు పెద్దకాలమయింది కదా. మీ అన్నయ్యచేసిన పనికి యింకా క్రుంగిపోతూంది. కనుక నీవయినా ఒక యింటివాడవయి ఆమెకు ఉపశాంతి కలిగిస్తే మంచిది.

ఒక్కగానొక్క పిల్లను అల్లారుముద్దుగా పెంచాను. బుద్ధిమంతుడు, మేనరికపుటల్లుడు కూడా అని అతనికిచ్చి పెళ్ళిచేశాను. కాని భగవంతుడు దాని నుదుట ఇంత ఘోరమైన విధి వ్రాశాడనుకోలేదు. అది మా దురదృష్టం.

మీకు కూర్చుని తినగలిగినంత మీ నాన్నగారు సంపాదించిపోయారు. కనుక ఏ చీకూ చింతా లేదు. కాని ఒక్కవిషయం—పెళ్లి కావలసిన యిద్దరు చెల్లెళ్లున్నారు. వారి సంగతి కొంచెం ఆలోచించాలి. ఇదివరకు మన కుటుంబాలకు మచ్చనేది లేదు. కాని మీ అన్నయ్య యెవరికీ తెలియకుండా యింట్లోది అయిదువేల రూపాయల రొక్కం కూడా తీసుకొని వెళ్ళడంలోని అంతరార్థం యెవరికీ తెలియడంలేదు కాని లోకం పలువిధాల చెప్పుకుంటుంది. ఎవరినో లేవదీసుకుపోయాడనీ, యేదో కూడనిపని చేశాడనీ ఇత్యాది. నీవు మగవాడివి. నీకు పిల్లనిస్తానని అంటూ చాలామంది వస్తున్నారు. నీవైనా సవ్యంగా జనసమ్మతంగా ఒక యింటివాడవైతే నీ చెల్లెళ్ళకు మంచి సంప్రదాయంగల సంబంధాలు వస్తాయి. ఈ విషయం నీవు సరియైన దృష్టితో ఆలోచిస్తావని నమ్ముతున్నాను.”

ఇట్లు
నీ మామయ్య
వెంకటేశం.

మామయ్య వుత్తరంతో నేనింకా అధోలోకంలోకి పడిపోయాను. ఇదివరకెన్నడూ నా మనస్సుకు తట్టని యెన్నో క్రొత్త ఆలోచనలు, ఆవేదనలు, నాలో విజృంభించాయి.

అన్నయ్య మా యిల్లువిడిచి నాలుగు సంవత్సరాలు దాటిపోయింది. నేనప్పటికి స్కూలుఫైనలు చదువుతున్నాను. అన్నయ్యంటే యింట్లో అందరికీ అభిమానమే. అతనుకూడా అందరితో చాలా బాగా కలిసిమెలిసివుండేవాడు. నాన్నగారుమాత్రం! అంత కోపం, ఛాందసంవున్న నాన్నగారు అన్నయ్యను యెంతో అభిమానించేవారు. ఇంకా నేనే అప్పుడప్పుడూ నాన్నగారితో చీవాట్లుతినేవాడిని. కాని అన్నయ్య యెప్పుడూ యెవరిచేతా పల్లెత్తు మాటయినా పడేవాడుకాదు.

కాలేజీలోకూడా అతను యెంతో మంచివాడనిపించుకునేవాడు. ఆ దినం బి. యే. పరీక్షా ఫలితాలువచ్చాయి అన్నయ్య ఫస్టుక్లాసులో ఉత్తీర్ణుడయ్యాడు, అందరం సంతోషంలోమునిగిపోయాం. ఆ రాత్రి తెల్లవారేసరికి అన్నయ్య యింట్లో లేడు. పక్కమీద ఉత్తరంమాత్రం వుంది—

"నేను వెళ్ళిపోతున్నాను. నా ఆశయాలకు, ఆనందాలకు ఈ యింట్లోని వాతావరణం సరిపడదు.

నేను ప్రపంచంలో యే మూలో సురక్షితంగా బ్రతికేవుంటాను. ఇనుపపెట్టెలోనుండి అయిదువేల రూపాయలు రొక్కం తీసుకుంటున్నాను. నన్ను క్షమించగలిగితే క్షమించండి"—అని.

ఆ దినం నాన్నగారు యెంత బాధపడిపోయారు! క్రమంగా ఆ బెంగతోనే క్షీణించి జబ్బుపడి, సంవత్సరం తిరగకముందే చనిపోయారు. సరే--అమ్మ! అమ్మవిషయం చెప్పనే అక్కరలేదు. అలాగ బాధపడుతూనే బ్రతుకుతూందామె. యిక పాపం! మామయ్య విచారానికి అంతమే లేదు. తన ఒక్కగానొక్క కుమార్తె లతను అన్నయ్యకిచ్చి పెండ్లిచేశాడు. అత్త చాలాకాలంక్రితమే చనిపోయింది. ఇంక తన ఒకేఒక కుమార్తె భవిష్యత్తు యిలా అయింది. అతనికి బాధకాక మరేముంది? ఎంత కుమిలిపోతున్నాడో!

లత యిప్పుడు శారదా నికేతనంలో చదువుతూ వుంది. స్కూలుఫైనలు పరీక్షకు కట్టిందట. పాపం! అమాయకురాలు. ఆమె ముగ్ధజీవితాన్ని అన్నయ్య చేతులారా నాశనంచేశాడు.

అన్నయ్య వెళ్ళిపోవడం విచారించదగిన విషయమే. కానీ అతను చేసిన నేరానికి శిక్ష అనుభవించవలసినది తోబుట్టువులా? ఆ నేరం కుటుంబానికే మచ్చగా భావింపబడుతుందా? దానిని దిద్దుకోవలసిన బాధ్యత నాదా? ఎంతవరకూ నేను సమర్థుణ్ణి!

ఈ ఆలోచనల అలలలో నలిగిపోయి, అలసిన మనస్సుతో అలాగే నాకు తెలియకుండా నిద్రపోయాను.

మరునాటి సాయంత్రం రాధ యింటికి రోజూకంటె త్వరగా వెళ్ళాను. అంత త్వరగా వెళ్ళడం అలవాటులేదేమో రాధ చాలా ఆశ్చర్యంగా—"ఇదేమిటి? ఈవేళప్పుడు వచ్చావు? అలవాటు లేదుగా!" అంది.

"ఎప్పుడూ అలవాటున్న పనులే చేస్తామా?" అన్నాను.

"సరే. ఆ గదిలో కూర్చో. స్నానానికి వెళ్తున్నాను. ఒక్కక్షణంలో వస్తాను" అని వెళ్ళింది.

గదిలో కూర్చున్నానేకాని మనస్సుకు స్థిమితం లేదు. ఏమిటో ఆలోచనలు, తెగని సమస్యలు. ఊరికే కూర్చోలేక అక్కడ అలమారాలో రాధ పుస్తకాలు తిరగవేయడం మొదలుపెట్టాను. ఇన్నిసార్లు వచ్చానేగాని నేనెన్నడూ రాధ యింట్లో అలమారాను తెరచిచూడడమూ లేదు, అవసరం కలగనూ లేదు. క్లాసు పుస్తకాలు యింకా చాలా ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలున్నయ్. ఒక్కొక్కటే పేజీలు తిరగవేస్తున్నాను. హఠాత్తుగా ఒక పుస్తకంలో వ్రాసిన వ్రాత నాకళ్ళబడ్డది.

"రాధకు ప్రేమతో......రఘునాధం"

రఘునాధం! అన్నయ్యేనా!!

"ఏమిటి మధూ, నా భాండాగారమంతా తిరగవేస్తున్నావు!" అంటూ వచ్చింది రాధ.

"ఊరికే కాని, యీ రఘునాధమంటే..."

"అంటే కాళహస్తి రఘునాధం" అంది అర్థోక్తిలోనే.

"ఏమిటీ! నీవు చెబుతున్నది నిజమేనా!" అన్నాను మరింత ఆశ్చర్యంగా.

"అవును ఏం! నీకు వారు తెలుసా?"

"అబ్బే! అంత పరిచయంలేదు. కాని యితడు మా అన్నయ్యకు క్లాసుమేటని చెబుతూవుండగా విన్నాను" అన్నాను ముఖం చాటుచేసుకొని.

"ఓహో మీ అన్నయ్య కాకినాడలో చదివారా?"

"అవును అయితే యితనేనా నిన్ను..."

"అవును ఇతనే నన్ను లేవదీసుకువచ్చింది." అన్నది నామాట పూర్తికాకమునుపే.

"రాధా, అయితే అతడు నిన్ను పెళ్ళిచేసుకోలేదా?"

"లేదు. నేను చేసుకోమని నిర్బంధించనూలేదు."

నేను వినేదంతా నిజమేనా అనిపించింది. రాధకూ, అసత్యానికి చాలాదూరమని నాకు తెలుసు కాని యింతకాలంనుండీ పరిచయమున్నా ఆమెనుండి యీదినం తెలుసుకొన్న సత్యం నేను యింతవరకూ, తెలుసుకోనేలేదు. ఇంతకాలం నాకు ఆమెభర్తచే పరిత్యజింపబడిన ఒక అభాగిని అని మాత్రమే తెలుసు. కాని ఆ భర్త పెళ్ళిచేసుకోకుండానే భర్తగా వ్యవహరించిన అసమర్థుడని తెలియలేదు. ఆ అసమర్థుడు మా అన్నయ్యేనా! ఎంత క్షుద్రమైన విషయం!

"ఏమిటి మధూ! అదంతా విచారమే? పద, బయట వాకిట్లో కూర్చుందాం. చల్లగాలైనా వీస్తుంది." అన్నదామె అతి మామూలుగా.

నాలో యింత జ్వాల, వేదనా, రగులుతూంటే యీమెకింత నిర్భయమేమిటి? ఆమె గతించిన జీవితంలోని దుస్సంఘటనలు గుర్తుకు వచ్చినపుడైనా యీమె చలించదేం? ఏమిటీమె వింతతత్వం!

ఆరుబయట యీజీచైరులో కూర్చుని అలా మనోపథంలో విహరిస్తున్నాను. కొంతసేపయాక- "అయితే రాధా, యింతకాలం నాకీసంగతి చెప్పలేదేం?" అన్నాను.

"ఏసంగతి?"

"అతను నిన్ను పెళ్ళిచేసుకోకుండానే కొంతకాలం గడిపాడని..."

"అలా చెప్పివుంటే పాపం! నాతో స్నేహం చేసేవారు కాదేమోకదూ!" అన్నది నవ్వుతూ. ఆమె అతి సామాన్యంగా నవ్విననవ్వు ఎంత విషాదభరిత హృదయాన్నైనా గిలిగింతలు పెడుతుంది. నేనుకూడా నవ్వేశాను.

"ఈ రఘునాథానికి ఒక తమ్ముడుండేవాడనుకుంటాను కదూ."

"ఏమో నాకు తెలియదు."

"అతను నీతో యెప్పుడూ చెప్పలేదా?"

"చెప్పే వుండవచ్చు. నేను గుర్తుపెట్టుకునే ప్రయత్నం చెయ్యలేదు."

"అయితే అతని యింటిని గురించిగాని. పరిస్థితులను గురించిగానీ నీకేమీ తెలియదన్నమాట. ఎంత విచిత్రం! రెండు సంవత్సరాలు అతనితో గడిపావన్నావు. కాని ఆయన ఆత్మీయులగురించి ఆయన ప్రస్తావించనూలేదు. నీవు తెలుసుకోనూ లేదు. ఎంత వింత ప్రకృతి!"

"ఇందులో వింతపడవలసినదేమున్నది మధూ! ఆత్మీయులను తలచుకొనే అగత్యం ఆయనకెన్నడూ కలగనేలేదు."

"కావచ్చు రాధా. నీలాంటి వ్యక్తి సహచర్యంలో అన్నింటినీ కురిపించే మధురానుభూతులనతడు పొందివుండవచ్చు. అందుకే సమస్తంమరచిపోయాడు. అందులో అతనితప్పులేదు. ఆ నీచుడు నిన్ను విడిచి యెలా వెళ్ళగలిగాడు రాధా? వాని పాపాని కంతంలేదు. నీవతనిని యెలా క్షమించగలిగావు?"

"క్షమించడమా? అది చాలా పెద్దమాట. ఒక వ్యక్తిచేసిన పనిని నిందించడానికిగాని, క్షమించడానికిగాని, మరొక వ్యక్తికి అధికారం, ఆధారం, కేవలం ఆ వ్యక్తులిద్దరూ అంతరాంతరాల్లో విలీనమై పోయినప్పుడే కలుగుతుంది. అలా కాక ఇద్దరు వ్యక్తులు వారివారి వ్యక్తిత్వాలను నిలబెట్టుకుంటూ అలానే నిలబడిన నాడు ఒకరిపై ఒకరికి యేవిధమైన అధికారమూలేదు. నీవు అనవసరంగా వారిని నిందించడం దేనికి? వారు నన్ను ఎంత తేలికగా తీసుకురాగలిగారో అంత తేలికగా విడిచిపెట్టగలిగారు. నేను కూడా అంతే."

"అయితే అతడు నీకింత అన్యాయంచేసినా..."

"ఆ మాటే అనవద్దు. అది అన్యాయమెలా అవుతుంది?"

"ప్రేమించి తీసుకువచ్చిన వ్యక్తిని గాలికీ ధూళికీ విడిచిపెట్టి తన వాడిని తాను పోవడం— అందులోనూ ఆమెను కావలసినంత అనుభవించి."

"పొరపడుతున్నావు మధూ! ఆయన అనుభవించినంత నేనూ అనుభవించాను. అందులో ఇద్దరం సమాన భాగస్థులమే. ఇకపోతే "ప్రేమ" అంటావూ—అది ఎవరికీ అర్థంకాని ఒక అపూర్వ విషయం. దానిలోతు కనిపెట్టడానికి జీవితమంతా తపస్సు చేయాలసి వస్తుంది. పట్టులేని భావావేశాలన్నిటినీ "ప్రేమ" అనే పేరుతో మభ్యపుచ్చుకుంటున్నారు. అది అందరూ అతి సామాన్యంగా వాడే పదమైపోయింది. తమను తాము మోసగించుకోవడానిక దొక పెద్ద బురఖా. అలా మోసగించుకున్నవారిలో ఆయనొకరు. అనుకున్నారు—నన్ను చాలా గాఢంగా ప్రేమిస్తున్నానని—కాని ఆయన పొరబడుతున్నారని నేనే తెలియజేశాను. ఆయన తనను తాను మోసగించుకుంటూ జీవించే జీవితంలోని మధురిమను తన నిజస్వరూపాన్ని తెలుసుకొని జీవించడంలో పొందలేక పోయారు."

రాధ చెప్పుకు పోతూంది. నాకామె వెల్లడించే ప్రతివిషయం వింతరంగులతో కలవరపెడుతూ వుంది. ఆమె యింకా చెబుతూంది:—

"ఆయన నన్ను ప్రేమించాననుకున్నారు. కాని అది ప్రేమ కాదంటాను నేను. కొంతవరకూ మోహం. కాని యేదో ఒక అనాథను వుద్ధరించాలనే అభిలాష అందులో యేదో సంస్కరణ వుందనే మహాగర్వం— ఆయనను ప్రేరేపించాయి. ఆయన నాతో గడిపిన రెండు సంవత్సరాలూ ఆనందంగానే గడిపారు. అతి భౌతికమైన వాంఛ పరిపూర్తి అయిన ఆనందం మాత్రమే. ఎందుకంటే ఆయన న్ననర్థంచేసుకోలేదు. చేసుకోలేక పోయారు. ఆయన నా కోసం చాలా చేశారు. కాని ప్రతిపనిలోనూ స్వార్థం కరుడు గట్టుకుని వుంది. ఆ స్వార్థంలో యేదోనిగూఢమయిన స్వాతిశయముంది. అంతేకాని సానుభూతిలేదు.

ఇక నా విషయం: నేనాయనను ప్రేమించలేదు. ఆ సంగతి నాకు యెప్పుడూ తెలుసు. ఆయన నన్ను ప్రేమింలేదని కూడా మొదటినుండీ తెలుసు."

"అయితే నీవెందుకు అతని వెంటవచ్చావు?"

"దానికి పెద్దకారణ మేమీలేదు. నేను శరణాలయంలో వుండేటప్పుడు ఒక బందిఖానా జీవితం జీవించాను. స్వేచ్ఛకోసం తహతహలాడాను బయట పడడాని కొకమార్గం దొరికింది. అందుచేత ఆయన వెంటవచ్చేశాను!"

"కాని ఆ మార్గం సవ్యమైనవి కాదని తర్వాత తెలుసుకుని వుంటావు."

"లేదు అలా అనుకోలేదు. నేను శరణాలయం విడిచి వచ్చేసినందుకు యీనాటివరకూ యెప్పుడూ విచారించలేదు. నిజానికి వారు నన్ను విడిచిపెట్టి వెళ్ళాలని బుద్ధిపూర్వకంగా చేయలేదు. నాకు తెలిసినసత్యాన్ని వారికి తెలియజేశాను. వారు దానిని భరించలేక పోయారు. అంతే."

ఆమె ముఖంలో ఆవేదన లేదు—ఆశ్చర్యం లేదు—విషాదం లేదు. ఆమె మామూలుగా నవ్వుతూ వుంది. నేనిక వూరుకోలేకపోయాను.

"నేను వెళతాను రాధా. తిరిగి రేపు కలుసుకొంటాను" అన్నాను యెంతో బరువుగా.

ఆమె నాకళ్ళల్లోకి సూటిగాచూస్తూ "నీవీ విషయాన్ని గురించి ఆలోచించి మనస్సు పాడు చేసుకోకు. గతించిన దానికి దేనికీ నేను విచారించడం లేదు. ఎవరిస్వార్థంకొరకు వారు విడిపోయాం. వ్యక్తికీ వ్యక్తికీ మధ్య అంతరాంతరాల్లోని సమైక్యతనే నేను 'ప్రేమ' అని నిర్వచిస్తాను. అదొక దివ్యానుభూతి. జీవితంలో విలువకట్టేది నేను ఆ ఒక్క అనుభూతికి మాత్రమే. ఆ విలువను నేను జారవిడుచుకున్ననాడు మాత్రమే నిజంగా దుఃఖిస్తాను. అంతవరకూ నాకు విచారమనేది వుండదు" అంది.

నేను మెల్లగా అక్కడనుండి కదిలిపోయాను.

(ముగింపు వచ్చే సంచికలో)

---

కొంతమంది వ్యక్తులు తమ హృదయాన్ని తీసికెళ్ళి ఆలోచనాశక్తిలో ఐక్యం చేసేస్తారు; మరి కొంతమంది తమ ఆలోచనా శక్తిలో హృదయాన్ని యిమిడ్చేస్తారు. రెండింటినీ వేర్వేరుగా ఉంచి సక్రమంగా పనిచేయించడమే వీళ్ళంతా నేర్చుకోవాలి.